దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన

విగ్రహాల ప్రతిష్ఠాపనలో మంగి రాములు మహరాజ్

నందిపేట్, డిసెంబర్ 18: మండలంలోని దేవిపట్నం గ్రామంలోని హనుమాన్ ఆలయంలో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. హనుమాన్ లయంలో దేవతా విగ్రహాల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా సోమవారం కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠాపనలు నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు నవీశ్‌శర్మ, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

భీమ్‌గల్, డిసెంబర్ 18: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు రైతు ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఆర్మూర్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు అప్పులు చేసి పంటలు పండిస్తే గిట్టుబాటు ధర రాక అప్పుల పాలవుతున్నారని అన్నారు. పంటలకు కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకవస్తామని, రైతులపై మోపిన తప్పుడు కేసులను ఎత్తివేస్తామని, విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకుంటామని మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని అన్నారు. మ్యానిఫెస్టోలో ప్రకటించిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు సాయిరెడ్డి, కృష్ణాగౌడ్, గులాబ్ హుస్సేన్, దేవదాస్, లింబాద్రి, నర్సాగౌడ్, జాకీర్, గంగారాం, ధర్మపురి, మల్కి సంజీవ్, గంగన్న పాల్గొన్నారు.

బహిష్కరణ కేసులో ఏడుగురికి రిమాండ్

మోర్తాడ్, డిసెంబర్ 18: మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో స్థల వివాదం విషయంలో ఒక కుటుంబాన్ని సంబంధిత కులసంఘం బహిష్కరించిన కేసులో ఏడుగురిని సోమవారం రిమాండ్‌కు పంపినట్లు అదనపు డిప్యూటీ కమిషనర్ జయరామ్, ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఈకేసులో శెట్పల్లి గ్రామానికి చెందిన బండి చిన్నలింబన్న, దాసరి మహేశ్, బబ్బూరి నరేశ్, బబ్బూరి గంగాధర్, బబ్బూరి బక్కన్న, మెంచు ప్రభాకర్, గురజాల కన్నారెడ్డిని రిమాండ్‌కు పంపించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎవరైనా బహిష్కరణలకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాలెం విద్యార్థుల విజ్ఞాన యాత్ర

మోర్తాడ్, డిసెంబర్ 18: పాలెం గ్రామానికి చెందిన ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు విజ్ఞాన, విహార యాత్రకు వెళ్లారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప ఆలయం, లక్నవరం సరస్సు, వేయి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయాలను సందర్శించినట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య తెలిపారు. ఆదివారం వెళ్లి సోమవారం తిరిగి వచ్చినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు రాములు, విశాల్, శ్యాంచరణ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ వోలకు శిక్షణ

మోర్తాడ్, డిసెంబర్ 18: మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం మోర్తాడ్, ఏర్గట్ల మండలాలకు చెందిన బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికంగా ఉండని ఓటర్ల తొలగింపు, నూతన ఓటర్ల గుర్తింపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుజాత, ఆర్ఐలు సదానంద్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఏర్గట్ల, డిసెంబర్ 18: 18 ఏండ్లు నిండి ఓటరు జాబితాలో పేరు లేనివారు జనవరి1 లోగా పేరు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ యూసుఫ్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. లోక్‌సభ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసినందున మార్పులు చేసుకోవచ్చని అన్నారు.

బోధన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆర్మూర్‌లోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అయ్యప్పస్వాములు

సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో పూజలు

శక్కర్‌నగర్, డిసెంబర్ 18: బోధన్ పట్టణం రాకాసీపేట్ భీమునిగుట్టపై ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్య స్వామి షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పసేవా సమితి ఆధ్వర్యంలో అర్చకులు సంతోష్ శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 61 జంటలతో కుంకుమార్చన, హారతి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమాలను అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు పర్యవేక్షించారు.

ఆర్మూర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలో..

ఆర్మూర్‌టౌన్, డిసెంబర్18: పట్టణంలోని జంబిహనుమాన్ అయ్యప్ప స్వామి ఆలయంలో అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించినట్లు గురుస్వామి నగేశ్ శర్మ తెలిపారు. కార్యక్రమంలో గురు స్వాములు, స్వాములు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాపోటీల్లో విద్యార్థి అమర్‌సింగ్ ప్రతిభ

అభినందించిన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

విద్యార్థి అమర్‌సింగ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 18 : అంతర్జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థిని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం అభినందించారు. నగరంలోని ఖిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర)కు చెందిన విద్యార్థి అమర్‌సింగ్ హెచ్ఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల నిర్వహించిన ఇండో-నేపాల్ ఇంటర్నేషనల్ రూరల్ గేమ్స్-2023 (ఆర్‌జీఎఫ్ఏ) క్రీడా పోటీల్లో కబడ్డీ విభాగంలో అమర్‌సింగ్ పాల్గొని ప్రతిభ చూపాడు. కీలకపాత్ర పోషించి జట్టుకు విజయాన్ని అందించడంతోపాటు మొదటి బహుమతి కింద బంగారు పతకాన్ని అందుకున్నాడు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రఘురాజ్ నేతృత్వంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును కలవగా.. ఆయన అభినందించారు. సదరు విద్యార్థికి డీఐఈవో రఘురాజ్ నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎంఎస్‌వీ ప్రసాద్, శివయ్య, అమర్‌సింగ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మగ్గిడి విద్యార్థినులు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

ఆర్మూర్‌టౌన్,డిసెంబర్18: ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన సుంకరి అమూల్య, తౌడిశెట్టి సంజన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ మదు సోమవారం తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో గత నెలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. తమిళనాడులో ఈ నెల 24 నుంచి నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. ప్రస్తుతం అమూల్య సుద్దపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం, సంజన దాస్‌నగర్ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నట్లు తెలిపారు. విద్యార్థులను ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, సర్పంచులు అభినందించారు.

రాష్ట్రస్థాయికి విద్యార్థిని ఎంపిక

ఆలూర్ మండలంలోని దేగం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని చందుశ్రీ రాష్ట్ర స్థాయి అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మోహన్‌రావు తెలిపారు. కామారెడ్డి జిల్లాలో రెండు వారాల క్రితం నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అసిఫాబాద్ కొమరంభీం జిల్లాలో ఈనెల 20 నుంచి నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థిని సోమవారం అభినందించారు.

ఖోఖో పోటీల్లో విద్యార్థి ప్రతిభ

విద్యార్థినిని సన్మానిస్తున్న అధ్యాపకులు

బోధన్, డిసెంబర్ 18: బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న (ఎన్‌సీసీ) క్యాడెట్ ఆర్. సుమన్ నేపాల్‌లో నిర్వహించిన ఇండోనేపాల్ రూరల్ గేమ్స్ చాంపియన్ షిప్ ఖోఖో పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. సోమవారం బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్.ఆర్.సురేశ్, సీనియర్ అధ్యాపకులు నహీదాబేగం, వీరప్రసాద్, కె. రాహుల్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ఎడపల్లి, డిసెంబర్ 18: బోధన్‌లో మంగళవారం నిర్వహించనున్న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ లక్ష్మణ్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోధన్‌లోని రాకాసిపేట్ భీముని గుట్ట వద్ద ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు ఈ వేదిక కొనసాగుతుందని తెలిపారు. రైతులు డిసెంబర్‌లో రూ.360 సర్వీస్ చార్జిను చెల్లించాల్సి ఉందని పేర్కొనారు. వినియోగదారుల బకాయి బిల్లులు చెల్లించాలని కోరారు.

పథకాలపై అవగాహన

రెంజల్, డిసెంబర్ 18: మండలంలోని దండిగుట్ట, దూపల్లి గ్రామాల్లో సోమవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలను నిర్వహించినట్లు ఎంపీడీవో శంకర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై 17 శాఖలకు సంబంధించిన అంశాలపై సంకల్ప యాత్రలో ప్రజలు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అర్హులై లబ్ధి పొందని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల క్యాలెండర్‌ను రైతు వేదికలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో దండిగుట్ట సర్పంచ్ ముళ్లపూడి శ్రీదేవి కృష్ణారావు, ఎంపీవో గౌసొద్దీన్, మండల పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణి, అయుష్మాన్ భారత్ వైదాధికారిణి ప్రమోదిత, హెచ్ఎం గణేశ్‌రావు కులకర్ణి, పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

పంటల వివరాలను నమోదు చేసుకోవాలి

బోధన్ రూరల్, డిసెంబర్ 13: యాసంగి సీజన్‌లో రైతులు సాగు చేసే పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని ఏఈవో గంగాజాల అన్నారు. సోమవారం బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి గంగాజలతో కలిసి పంటల వివరాలను నమోదు చేశారు.